సాక్షి
పెద్దపల్లి
బుధవారం । 1 । జనవరి । 2025



చిన్నారి నృత్యం



సుల్తానాబాద్‌లో కుర్రకారు హుషారు



2025కు గ్రాండ్ వెల్‌కమ్

జిల్లావాసులు 2024 సంవత్సరానికి ఘనంగా వీడ్కోలు పలికారు. 2025వ సంవత్సరానికి ఉత్సాహంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల్లో మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం ఉదయం వరకూ వేడుకలు ఉత్సాహంగా జరుపుకున్నారు. తొలుత కేక్‌లు కట్‌చేసి మిఠాయిలు పంచిపెట్టారు. మనస్సును హత్తుకునే పాటలు, ఉర్రూతలూగించే నృత్యాలు.. ఇతర సాంస్కృతిక ప్రదర్శనలతో నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు.

– సాక్షి, ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి





యువతి నృత్యం



సంబురాల్లో మహిళలు, చిన్నారులు



పెద్దపల్లిలో పోలీసుల డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు

న్యూస్‌రీల్

రైల్వే వంతెన పనుల్లో వేగం పెంచాలి



పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి–కూనారం మార్గంలోని రైల్వే లెవల్‌క్రాసింగ్ వద్ద చేపట్టిన వంతెన(ఆర్వోబీ) పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. స్థానిక రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులను మంగళవారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రజల సౌకర్యం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.119.50 కోట్ల వ్యయంతో రైల్వే వంతెన పనులు చేపట్టాయని తెలిపారు. ఇందుకు అవసరమైన నిధులను విడుదల చేశాయని వివరించారు. వచ్చే వేసవి వరకు పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఇంజినీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పెండింగ్ భూసేకరణ కోసం డిమాండ్ నోటీసులను అందించాలని ఆయన సూచించారు. రైల్వే వంతెన సమీపంలో సర్వీసు రోడ్డు పనులు సమాంతరంగా జరగాలని, పనులు ప్రజలకు సౌకర్యంగా ఉండాలని కలెక్టర్ అన్నారు. కార్యక్రమంలో ఆర్ అండ్ బీ ఈఈ భావ్‌సింగ్, తహసీల్దార్ రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

టీబీ రహిత సమాజ నిర్మాణం లక్ష్యం



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో అన్నప్రసన్న

పెద్దపల్లిరూరల్: టీబీ రహిత సమాజ నిర్మాణం లక్ష్యంగా ప్రతీపౌరుడు తమకు సహకారం అందించాలని జిల్లా వైద్యాధికారి అన్నప్రసన్నకుమారి అన్నారు. భోజన్నపేట గ్రామంలో మంగళవారం నిర్వహించిన అవగాహన ర్యాలీ, స్క్రీనింగ్ టెస్ట్ శిబిరాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. నిక్షయ్ శిబిర్ –100 రోజుల కార్యక్రమంలో భాగంగా గ్రామీణులకు టీబీపై అవగాహన కల్పిస్తున్నామని ఆమె తెలిపారు. వ్యాధి లక్షణాలు ఉన్నవారికి ఆర్నెల్లపాటు ప్రభుత్వమే ఉచితంగా మందులు పంపిణీ చేస్తుందని అన్నారు. టీబీ సీనియర్ సూపరింటెండెంట్ తిరుపతి, సాంబయ్య, సరోజ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సబ్ కోర్టు ఏజీపీగా రాజు



ఉప్పు రాజు

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలోని ప్రగతినగర్ ప్రాంతానికి చెందిన న్యాయవాది ఉప్పు రాజు సీనియర్ సివిల్‌కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్(ఏజీపీ)గా నియమితులయ్యారు. రాజు నియామకంపై పట్టణానికి చెందిన పలువురు నాయకులు, ప్రతినిధులు, న్యాయవాదులు అభినందనలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే విజయరమణారావుకు రాజు కృతజ్ఞతలు తెలిపారు.

క్వింటాల్ పత్తి రూ.7,171

పెద్దపల్లిరూరల్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం పత్తి క్వింటాలుకు గరిష్ఠంగా రూ.7,171 ధర పలికిందని మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి దేవరాజ్ పృథ్వీరాజ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కనిష్ఠంగా రూ.6,011గా నమోదైందన్నారు. సరాసరి రూ.6,961 ధర ఉందని వివరించారు. జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన 191 మంది రైతులు తెచ్చిన 720 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

కేదార్ రంజన్‌పాండుకు సన్మానం



పాండును సన్మానిస్తున్న బాబర్ సలీంపాషా

జ్యోతినగర్(రామగుండం): ఉద్యోగ విరమణ చేసిన ఎన్టీపీసీ ఆర్‌ఈడీ కేదార్ రంజన్ పాండును సన్మానించారు. ఎన్టీపీసీ పర్మినెంట్ టౌన్‌షిప్ కాకతీయ ఆడిటోరియంలో మంగళవారం సదరన్ రీజియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, రామగుండం–తెలంగాణ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్ పాండు ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించారు. ఆర్‌ఈడీకి పూలమాల వేసి, శాలువా కప్పి జ్ఞాపిక అందించారు. ఈ సందర్భంగా ఎన్టీపీసీ ఎన్సీసీ సభ్యుడు బాబర్ సలీంపాషా మాట్లాడుతూ, పదవీ విరమణ ప్రతీ ఉద్యోగికి సహజమన్నారు. జనరల్ మేనేజర్లు, అధికారులు, ఉద్యోగ గుర్తింపు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ వేముల కృష్ణయ్య, ప్రధానకార్యదర్శి ఆరెపల్లి రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కోటి ఆశలతో కొత్త ఏడాదిలోకి..

- సమర్థవంతంగా సేవలు అందిస్తాం
- ఉద్యోగులను సమన్వయం చేస్తాం
- జిల్లా అధికారుల మనోగతం
- పవర్ ప్లాంట్ల ఏర్పాటు లక్ష్యం – రామగుండం ఎమ్మెల్యే ఠాకూర్
- నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం– పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు
- జిల్లావాసులకు కొత్త సంవత్సరం శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ప్రముఖులు

సాక్షి, పెద్దపల్లి: కొత్త ఆశలు.. కొంగొత్త ఆశయాలతో జిల్లావాసులు 2025 సంవత్సరానికి స్వాగతం పలికారు. గతేడాది మిగిల్చిన జ్ఞాపకాలు, సరికొత్త లక్ష్యాలతో నవ వసంతంలోకి అడుగుపెట్టారు. 2024కి వీడ్కోలు చెప్పి.. 2024కి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు జిల్లావాసులకు శుభాకాంక్షలు తెలిపారు. గతేడాది సాధించిన విజయాలు, ఈఏడాది నిర్దేశిత లక్ష్యాలను 'సాక్షి'తో పంచుకున్నారు. వారి మాటల్లోనే..



పెద్దపల్లిలోని ఓ బేకరీలో కేక్‌ల కొనుగోలు కోసం బారులు తీరిన వినియోగదారులు

అభివృద్ధి చేస్తా



గతేడాది కోతల్లేకుండా ధాన్యం కొనుగోలు చేశాం. రైతులకు చిన్నఇబ్బంది కూడా తలెత్తకుండా చర్యలు తీసుకున్నాం. కొత్త ఏడాదిలోనూ రైతులకు మరింత సమర్థవంతంగా మేలు చేసేలా ప్రణాళిక రూపొందిస్తాం. విధి నిర్వహణకు అధిక ప్రాధాన్యం ఇస్తాం. అర్హులైన ప్రతీఒక్కరికి సంక్షేమ పథకాలు వర్తించేలా నా వంతు ప్రయత్నం చేస్తా. విద్య, వైద్యం మరింత మెరుగుపరిచేలా చొరవ తీసుకుంటాం. ఆరు గ్యారంటీలు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను పకడ్బందీగా అమలు చేస్తాం. ఇందుకోసం అధికార యంత్రాంగాన్ని సమన్వయం చేస్తాం. వీరి స్ఫూర్తితో జిల్లాను అభివృద్ధి చేస్తాం. అవినీతి, నిర్లక్ష్యానికి ఆస్కారం లేకుండా కొత్త సంవత్సరంలో అధికార యంత్రాంగం మరింత బాధ్యతతో పనిచేసేలాచే లక్ష్యం నిర్దేశిస్తాం.

– కోయ శ్రీహర్ష, కలెక్టర్

గ్రీవెన్స్ సమస్యలపై ఫోకస్



రామగుండం కార్పొరేషన్, పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీల్లో వచ్చే ఫిర్యాదులకు శాశ్వత పరిష్కా రం చూపుతాం. ఒకసారి వచ్చి న ఫిర్యాదు మరోసారి రాకుండా సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ ముందుకుసాగుతాం. పారిశుధ్యం నిర్వహణ, తాగునీరు, డ్రైనేజీ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. గతేడాది పార్లమెంట్ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాం. భవిష్యత్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు చేపడతాం. గ్రామ పంచాయతీలు జాతీయ స్థాయిలో ఉత్తమ అవార్డులు సాధించాయి. కొత్త సంవత్సరంలోనూ మరిన్ని అవార్డులు సాధించేలా ప్రణాళికతో ముందుకుసాగుతాం.

– అరుణశ్రీ, అదనపు కలెక్టర్

భూ సమస్యలకు పరిష్కారం



ప్రభుత్వ లక్ష్యం మేరకు అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించేలా పాలన కొనసాగిస్తాం. కొత్త రెవెన్యూ చట్టం ఆధారంగా, భూమాత పోర్టల్ ద్వారా పెండింగ్ సమస్యలు పరిష్కరిస్తాం. దీనికే తొలి ప్రాధాన్యం ఇస్తాం. రైతులకు ఇబ్బందులు కలుగకుండా వానాకాలం ధాన్యం కొనుగోలు చేశాం. భవిష్యత్‌లోనూ ధాన్యంలో కోతల్లేకుండా సజావుగా కొనుగోళ్లు సాగేలా చర్యలు తీసుకుంటాం. రైస్ మిల్లుల నుంచి పెండింగ్ సీఎమ్మార్‌ను కచ్చితంగా వసూలు చేస్తాం.

– వేణు, అదనపు కలెక్టర్

రూపురేఖలు మార్చుతాం



పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్ర హోదాకు తగిన విధంగా పెద్దపల్లిని అభివృద్ధి చేస్తాం. కొత్త ఏడాదిలో అనేక అభివృద్ధి పనులు చేపట్టి రూపురేఖలు మార్చుతాం. జిల్లా పర్యటన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి అనేక వరాలు ప్రకటించడమే కాకుండా జీవోలు కూడా జారీ చేశారు. వ్యవసాయ రంగాన్ని పటిష్టం చేసేందుకు పత్తిపాక రిజర్వాయర్ ద్వారా సాగునీరు అందిస్తాం. పెద్దపల్లిలో త్వరలోనే ఆర్టీసీ బస్సు డిపో ఏర్పాటు చేస్తాం. బైపాస్ రోడ్డు, రూరల్, మహిళా, ఎలిగేడులో పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు.. ఇంకా అనేక అభివృద్ధి పనులు త్వరలోనే పూర్తవుతాయి. ఇవేకాకుండా పెద్దపల్లి, సుల్తానాబాద్ మున్సిపాలిటీల్లో రూ.కోట్లు వెచ్చించి చేపట్టిన పనులు పురోగతిలో ఉన్నాయి. ప్రధాన కూడళ్లను సుందరీకరించడంతోపాటు పట్టణ ప్రజల వినోదం కోసం పార్కుల ఏర్పాటుకు ప్రయత్నిస్తాం.

– విజయరమణారావు, ఎమ్మెల్యే, పెద్దపల్లి

పవర్ ప్లాంట్ల ఏర్పాటే లక్ష్యం



గోదావరిఖని: నూతన సంవత్సరంలో కొత్త పవర్ ప్లాంట్ల ఏర్పాటే లక్ష్యంగా ముందుకు సాగుతాం. రామగుండంలో 800 మెగావాట్లు, ఎన్టీపీసీలో 800 మెగావాట్ల సామర్థ్యంతో మూడు పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తాం. సింగరేణి ఆధ్వర్యంలో మరో 500 మెగావాట్ల హైడ్రోపవర్ ప్లాంట్ స్థాపిస్తాం. బండలవాగుపై ఎత్తిపోతల పనులు ఈనెలలో ప్రారంభిస్తాం. పాలకుర్తి ఎత్తిపోతలపై స్పష్టత వస్తోంది. త్వరలోనే ఇంటిగ్రేటెడ్ స్కూల్ ప్రారంభిస్తాం. రామగుండంలో ఫ్లై ఓవర్, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణం శరవేగంగా పూర్తిచేస్తాం.

– ఎంఎస్ రాజ్‌ఠాకూర్, ఎమ్మెల్యే, రామగుండం

సైబర్ నేరాలపై ఫోకస్



సాక్షి, పెద్దపల్లి: పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటాం. పోలీసులు అంటే ప్రజల్లో భయం పోగొట్టి స్వేచ్ఛగా మాతో మమేకం అయ్యేలా చూస్తాం. లోక్‌సభ ఎన్నికలను సవాల్‌గా తీసుకొని ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించాం. పోలీస్ కానిస్టేబుల్ నుంచి డీసీపీ వరకు జవాబుదారీతనంతో నడుచుకునేలా కృషి చేస్తాం. మహిళల భద్రతకు ప్రాధాన్యం ఇస్తాం. కొత్త సంవత్సరంలో యువత నూతన లక్ష్యాలతో ముందుకు సాగాలి.

– డాక్టర్ చేతన, డీసీపీ, పెద్దపల్లి

'ఆపరేషన్ గరుడ'ను విస్తరిస్తాం



గోదావరిఖని: నేర, చట్టవ్యతిరేక కార్యకలాపాల నియంత్రణకు ఏర్పాటు చేసిన ఆపరేషన్ గరుడను పోలీస్ సబ్ డివిజన్లకు విస్తరిస్తాం. డ్రోన్ కెమెరాల కొనుగోలుకు ప్రతిపాదనలు పంపించాం. ప్రజల్లో మమేకం కావడానికి పల్లెనిద్ర కొనసాగిస్తాం. గంజాయి నిర్మూలనకు పకడ్బందీ వ్యూహంతో ముందుకు సాగుతున్నాం. భూకబ్జాదారులు, చీటర్లు, బ్లాక్‌మెయిలర్ల ఆటకట్టిస్తాం. పోలీసులపై ఎదురుతిరిగే వారిని వదిలిపెట్టేదిలేదు. తప్పుచేసే పోలీసులనూ వదిలిపెట్టేదిలేదు. విజుబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యం ఇస్తాం.

– శ్రీనివాస్, పోలీస్ కమిషనర్, రామగుండం

పశువుల పాలైన కార్మికుల బెల్లం



ట్రాక్టర్‌లో బెల్లం లోడ్ చేస్తున్న పారిశుధ్య సిబ్బంది

కోల్‌సిటీ(రామగుండం): కంపుకొడుతున్న చెత్తను తొలగించి.. రోడ్లను శుభ్రం చేస్తూ దుమ్ము, ధూళిని పీల్చే పారిశుధ్య కార్మికులు అనారోగ్యం బారిన పడొద్దనే సంకల్పంతో అధికార యంత్రాంగం క్రమం తప్పకుండా బెల్లం పంపిణీ చేస్తూఉంటుంది. కానీ రామగుండం నగరపాలక సంస్థ అధికారులు కార్మికులకు బెల్లం ఇవ్వకుండా వృథా చేస్తున్నారు. మంగళవారం సుమారు 600 కిలోల బెల్లాన్ని ఏకంగా పశువులపాలు చేయడం విమర్శలకు దారితీసింది. ఐదు నెలల క్రితం ఓ కాంట్రాక్టర్ ద్వారా అధికారులు బెల్లం తెప్పించారు. అది నాసిరకంగా ఉందని, కరిగిపోయి తినడానికి కూడా పనికిరాకుండా దుర్వాసన వస్తోందని ఇటీవల కార్మికులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు బెల్లాన్ని కార్మికులకు పంపిణీ చేయకుండా మూలన పడేశారు. రోజురోజుకూ బెల్లం మురిగిపోయి దుర్వాసన వ్యాపిస్తుండడంతో గత్యంతరం లేక మంగళవారం నగరంలోని గోశాలలకు ట్రాక్టర్లు, ఆటో ట్రాలీల్లో తీసుకెళ్లి పశువులకు ఆహారంగా వేశారు. దీనిపై బల్దియాలో సర్వత్రా విమర్శలు వచ్చాయి.

జీజీహెచ్‌లో నాణ్యమైన వైద్యసేవలు

- సూపరింటెండెంట్ దయాల్‌సింగ్

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖనిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో వైద్యసేవలు మెరుగయ్యాయని, ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి ఆర్థికంగా నష్టపోవద్దని ఆస్పత్రి సూపరింటెండెంట్ దయాల్‌సింగ్, సిమ్స్ ప్రిన్సిపాల్ హిమబిందుసింగ్ సూచించారు. జీజీహెచ్‌లో మంగళవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతేడాదిలో చాలారిస్క్ కేసులను సవాల్‌గా తీసుకొని వైద్యసేవలు అందించామన్నారు. ఆపరేషన్ థియేటర్లను ఆధునికీకరించామని, ఏఆర్‌టీ కేంద్రాన్ని కూడా బ్లడ్ సెంటర్ సమీపంలోని భవనానికి తరలించామని తెలిపారు. కంటి శస్త్రచికిత్సలు నిర్వహించడానికి ఆపరేషన్ థియేటర్‌ను సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్తులో ఈఎన్‌టీ, ఎంఆర్ఐ, న్యూరో తదితర ఆధునిక వైద్య సేవలు అందిస్తామని వారు వివరించారు. బోధనాస్పత్రిలో స్పెషలిస్టుల కొరత ఉన్నా.. ఉన్నవారితోనే అంతరాయం కలుగకుండా సేవలు అందిస్తున్నామని వివరించారు. ఇంతమంచి సేవలు అందిస్తున్నా కొందరు స్థానికంగా ఉండడం లేదని ఆరోపణలు చేస్తుండడం బాధగా ఉందని మహిళా వైద్యులు కంటతడి పెట్టారు. ప్రొఫెసర్లు అరుణ, నరేందర్, లక్ష్మీనర్సయ్య, శ్రీదేవి, వేణుమాధవ్, అనంతబాబు, రాజు, హర్షిణి, శ్రీహర్ష పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హిమబిందుసింగ్

పెట్రోల్ బంక్‌లకు పెనాల్టీ నోటీసులు

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మూడు పెట్రోల్ బంక్‌లకు పెనాల్టీ నోటీసులను జారీచేసినట్లు ఎఫ్ఏసీ కమిషనర్ అరుణశ్రీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బంక్‌ల నిర్మాణ అనుమతులు లేకపోవడంతోనే కలెక్టర్ ఆదేశాల మేరకు నోటీసులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. నగరంలోని సంతోషిమాత ఆటో సర్వీసెస్ బంక్‌కు రూ.14.78 లక్షలు, లేపాక్షి ట్రాన్స్‌పోర్ట్‌కు రూ.38.50 లక్షలు, హరా ఫిల్లింగ్ స్టేషన్ బంక్‌కు రూ.19.36 లక్షలు జరిమానా చెల్లించాలని నోటీసుల్లో పేర్కొన్నారు. నిర్ణీత గడువులోగా పెనాల్టీలను చెల్లించకపోతే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని నోటీసుల్లో హెచ్చరించారు.

క్లుప్తంగా

ఎన్టీపీసీ సదరన్ రీజియన్ ఈడీగా అజయ్

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ సదరన్ రీజియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా కార్పొరేట్ సెంటర్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(కమర్షియల్)గా విధులు నిర్వహిస్తున్న అజయ్ దువాను నియమించారు. ఈమేరకు కార్పొరేట్ సెంటర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(హెచ్‌ఆర్) సీ కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఆర్‌ఈడీగా విధులు నిర్వహిస్తున్న కేదార్ రంజన్ పాండు పదవీ విరమణ చేయడంతో ఆయనస్థానంలో ఆర్‌ఈడీగా అజయ్‌దువాను నియమించారు.

నాసిరకం ఎరువులు విక్రయిస్తే చర్యలు



ఎరువులపై ఆరా తీస్తున్న డీఏవో ఆదిరెడ్డి

కమాన్‌పూర్(మంథని): నాసిరకం ఎరువులు, పురుగు ముందులు, విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి హెచ్చరించారు. స్థానిక డీసీఎంఎస్‌తోపాటు ఎరువుల షాపులను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. రైతులు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు తీసుకుంటూ పంటలకు ఎరువులను వాడాలని సూచించారు. డీఏవో వెంట ఏవో గిరి రామకృష్ణ తదితరులు ఉన్నారు.

అనుమానమే పెనుభూతమై..

- భార్య మేనమామపై హత్యాయత్నం
- చూస్తుండగానే తల్వార్‌తో దాడి
- ప్రాణాపాయ స్థితిలో బాధితుడు శ్రీనివాస్



బాధితుడు శ్రీనివాస్

గోదావరిఖని: మాట్లాడే పనుందని పిలిచి భార్య మేనమామపై తల్వార్‌తో దాడిచేసి తీవ్రంగా గాయపర్చిన సంఘటన కోల్‌బెల్ట్ ప్రాంతంలో మంగళవారం సంచలనం సృష్టించింది. స్థానిక వినోభానగర్‌కు చెందిన నంది శ్రీనివాస్‌ను మంచిర్యాల జిల్లా భీమారం మండల కేంద్రానికి చెందిన గొల్ల శ్రావణ్ కాలేజీ గ్రౌండ్‌లో వందలాది మంది విద్యార్థులు చూస్తుండగానే తల్వార్‌తో విచక్షణ రహితంగా దాడచేశాడు. తీవ్రగాయాలపాలైన నంది శ్రీనివాస్ చావుబతుకుల మధ్య ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. గోదావరిఖని ఏసీపీ



నిందితుడు గొల్ల శ్రావణ్ అరెస్ట్ చూపిస్తున్న ఏసీపీ రమేశ్

రమేశ్ కథనం ప్రకారం.. భీమారం ప్రాంతానికి చెందిన గొల్ల శ్రావణ్ వినోభానగర్‌కు చెందిన నంది శ్రీనివాస్ మేనకోడలు కాళ్ల పూజను ఆరేళ్లక్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. శ్రావణ్‌కు ఇతర మహిళతో వివాహేతర సంబంధం ఉందనే కారణంతో భార్యాభర్తల మధ్య ఏడాదిగా గొడవలు జరుగుతున్నాయి. ఈక్రమంలో పూజ మేనమామ జోక్యం చేసుకుని ఎందుకు కొడుతున్నావని భీమారం వెళ్లి అతడి తల్లిదండ్రులతో మాట్లాడి పద్ధతి మార్చుకోవాలని చెప్పి వచ్చాడు. తన ప్రవర్తన మార్చుకోకుండా గొల్ల శ్రావణ్ తనభార్య పూజను మళ్లీ కొట్టడంతో నంది శ్రీనివాస్, నంది నగేశ్, కాళ్ల కిరణ్ భీమారం వెళ్లి పూజను ఇంటికి తీసుకువచ్చారు. దీంతో పగపెంచుకుని శ్రావణ్ మంగళవారం గోదావరిఖనికి బైక్‌పై చేరుకున్నాడు. ఎలక్ట్రికల్ షాపులో పనిచేస్తున్న నంది శ్రీనివాస్‌ను బైక్‌పై ఎక్కించుకుని స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ గ్రౌండ్‌కు తీసుకువచ్చాడు. అప్పటికే వెంట తెచ్చుకున్న తల్వార్‌తో నంది శ్రీనివాస్‌పై విచక్షణ రహితంగా దాడిచేశాడు. రామగుండం సీపీ శ్రీనివాస్, డీసీపీ చేతన ఆదేశాల మేరకు వెంటనే రంగంలో దిగిన వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బలగాలను ఏర్పాటు చేసి నిందితుడు గొల్ల శ్రవణ్‌ను పట్టుకుని అరెస్ట్ చేశారు. తాను చేసిన తప్పును కప్పిపుచ్చుకోవడానికి భార్యపై తప్పుడు ఆరోపణలు చేసి, అనుమానిస్తూ ఈఅఘాయిత్యానికి దిగినట్లు ఏసీపీ వెల్లడించారు. కాగా బాధితుడిని చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉంది. సమావేశంలో సీఐలు ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శేషజీవితాన్ని ఆనందంగా గడపాలి

గోదావరిఖని: ఉద్యోగ విరమణ పొందిన అధికారులు తమ శేషజీవితం ఆనందంగా సాగాలని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ ఆకాంక్షించారు. మంగళవారం ఉద్యోగ విరమణ పొందిన ఏఆర్, శ్రీరాంపూర్, మంథని ఎస్సైలు లక్ష్మణ్, అక్బర్‌పాషా, రాములు, ఏఎస్సైలు షఫీఉల్లాఖాన్, రవీందర్‌కు ఆయన శాలువాలతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. అదనపు పోలీసు అధికారులు రాజు, ప్రతాప్, సుందర్‌రావు, శ్రీనివాస్, దామోదర్, వామనమూర్తి, శ్రీనివాస్, మల్లేశం, సంపత్, ఇంద్రసేనారెడ్డి, మనోజ్ కుమార్, సంధ్య, పోచలింగం, స్వామి తదితరులు పాల్గొన్నారు.



రిటైర్డ్ పోలీస్ అధికారులతో పోలీస్ కమిషనర్ శ్రీనివాస్

పదోన్నతితో బాధ్యత పెరుగుతుంది

పదోన్నతితో బాధ్యత పెరుగుతుందని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. కమిషనరేట్ పరిధిలోని ముగ్గురు హెడ్‌కానిస్టేబుళ్లకు ఏఎస్సైలుగా పదోన్నతి రావడంతో సీపీ స్టార్స్ బహూకరించి మాట్లాడారు. పదోన్నతి పొందిన వారు క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని సూచించారు. అనంతరం 43ఏళ్లపాటు పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డులను సీపీ సన్మానించి ఆత్మీయ వీడ్కోలు పలికారు.

మీకోసం జైల్లో న్యూఇయర్ సెలబ్రేషన్స్ రెడీ



సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన పోస్ట్

శంకరపట్నం(మానకొండూర్): 2024 సంవత్సరానికి గుడ్‌బై చెప్పి 2025 సంవత్సరానికి స్వాగతం చెప్పేందుకు మద్యం తాగి వాహనాలు నడిపేవారు, రోడ్లపై స్టంట్లు, న్యూసెన్స్ చేసేవారి కోసం మీకోసం జైల్లో న్యూఇయర్ సెలబ్రేషన్ రెడీ పేరిట శంకరపట్నం మండలంలో సామాజిక మాధ్యమంలో కేశవపట్నం ఎస్సై రవి వినూత్న రీతిలో పోస్టులు పెట్టి యువతను ఆలోచనలో పడేశారు. డ్రగ్స్ సేవించే వ్యక్తుల కోసం తెలంగాణ పోలీసులు బేడీలతో రెడీగా ఉన్నారని, సహాయం కోసం డయల్ 100ను సంప్రదించాలని పోలీసులు ముద్రించిన రాతలు వైరలయ్యాయి.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఐదుగురిపై కేసు

ధర్మపురి: డ్రంకెన్ డ్రైవ్‌లో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ రాంనర్సింహారెడ్డి తెలిపారు. పట్టణంలో మంగళవారం సాయంత్రం వాహనాల తనిఖీ చేపట్టారు. మద్యం తాగి వాహనాలు నడిపిస్తున్న యువకులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎస్సై ఉదయ్‌కుమార్, పోలీస్ సిబ్బంది తదితరులున్నారు.

డబ్బుల కోసమే తండ్రి హత్య

పాలకుర్తి(మంథని): మద్యం మత్తులో ఉన్న సందవేన రమేశ్ డబ్బుల కోసమే తన తండ్రి శంకరయ్యను హత్య చేసినట్లు పెద్దపల్లి సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈమేరకు నిందితుడిని అరెస్ట్ చేశామన్నారు. సీఐ కథనం ప్రకారం.. రామారావుపల్లి గ్రామానికి చెందిన కేశోరాం రిటైర్డ్ కార్మికుడు సందవేన శంకరయ్య కుమారుడు రమేశ్ మద్యానికి బానిసయ్యాడు. జులాయిగా తిరుగుతున్నాడు. ఇటీవల శంకరయ్య వడ్లు విక్రయించాడు. అందుకు సంబంధించిన డబ్బులు వచ్చాయి. వాటిని తనకు ఇవ్వాలని రమేశ్ కొద్ది రోజులుగా తండ్రితో గొడవ పడుతున్నాడు. డబ్బులు ఇస్తే మద్యం తాగేందుకు ఖర్చు చేస్తాడనే కారణంతోనే శంకరయ్య ఇవ్వడం లేదు. దీంతో కక్ష పెంచుకున్న రమేశ్.. గత డిసెంబరు 29న ఉదయం తండ్రితో గొడవపెట్టుకున్నాడు. ఇంట్లో తను, లేదా తన తండ్రి ఎవరైనా ఒకరే ఉండాలంటూ బయటకు వెళ్లిపోయాడు. ఈనేపథ్యంలో డిసెంబర్ 30న సాయంత్రం 4 గంటల సమయంలో ఇంటికి వచ్చిన రమేశ్, నిద్రపోతున్న తండ్రి తలపై గొడ్డలితో దాడి చేయడంతో అక్కడికక్కడే మృతు చెందాడు. ఆ తర్వాత రమేశ్ పరారయ్యాడు. ఈమేరకు గ్రామశివారులోని శ్రీసమ్మక్క–సారలమ్మ గద్దెల ప్రాంగణంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హత్యకు ఉపయోగించిన గొడ్డలిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. బసంత్‌నగర్ ఎస్సై స్వామి, ఏఎస్సై సత్యనారాయణ, పోలీస్‌సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై స్వామి తదితరులు

భార్యను కడ తేర్చిన భర్త

- గోపాల్‌పూర్‌లో ఘటన



సంధ్య(ఫైల్)

మంథని: కట్టుకున్న భార్యను కడతేర్చిన విషాద సంఘటన మంగళవారం గోపాలపూర్ శివారులో చోటుచేసుకుంది. ఎస్సై రమేశ్ కథనం ప్రకారం.. మంథని మండలం గుంజపడుగు గ్రామానికి చెందిన బొల్లి ఓదెలు ముత్తారం మండలం జిల్లెల్లపల్లి గ్రామానికి చెందిన గద్దం రాజేశం కూతురు సంధ్యను(30)ను పదేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. కట్నం కింద రూ.10లక్షలు అప్పగించారు. ఓదెలు జీవనోపాధి కోసం గోపాల్‌పూర్ శివారులో ఓ గదిని అద్దెకు తీసుకొని చికెన్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. అదే గదిలో నివాసం ఉంటున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు. భూమి విషయంలో భార్యభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈసమయంలోనే మంగళవారం ఆమెను చంపడానికి ప్రయత్నించాడు. కుమామారులిద్దరూ పాఠశాలకు వెళ్లడంతో ఇంట్లో భార్యాభర్తలు ఇద్దరే ఉన్నారు. సంధ్య ఇంట్లోనే నిద్రిస్తోంది. ఈ అవకాశాన్ని అదనుగా తీసుకున్న భర్త ఓదెలు భార్య ముఖం వద్ద దిండును పెట్టి గట్టిగా అదిమి పట్టుకోవడంతో ఊపిరి ఆడక సంధ్య ప్రాణాలు విడిచింది. ఆమె మృతి చెందిన విషయాన్ని నిర్ధారించుకున్న భర్త ఓదెలు.. తన బావమరిదికి ఫోన్‌చేసి మీ అక్క నిద్రలేవడం లేదని సమాచారం అందించాడు. ఆ తర్వాత కుటుంబ సభ్యులు వచ్చి చూడగా చనిపోయి ఉంది. సీఐ రాజు, ఎస్సై రమేశ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతురాలి సోదరుడు శ్రీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వివరించారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

వీర్నపల్లి: మండలంలోని బంజేరు గ్రామంలో సోమవారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో కత్తరపాక రాజయ్య ఇల్లు దగ్ధమైంది. స్థానికులు ఫైరింజన్‌కు సమాచారమివ్వగా సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. ఇంట్లో సామగ్రి, బీరువా, బట్టలు, విలువైన వస్తువులు కాలిపోయాయి. దాదాపు రూ.3 లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు. ఆర్‌ఐ సంతోష్, ఎస్సై ఎల్లయ్యగౌడ్ ఘటన స్థలానికి చేరుకొని రాజయ్య కుటుంబానికి తక్షణ సాయం కింద 25 కేజీల బియ్యం అందజేశారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.



బాధిత కుటుంబానికి బియ్యం అందజేస్తున్న ఆర్‌ఐ సంతోష్

ప్రమాదమా.. పనిగట్టుకుని చేసిందా?

- పోలీసులకు పట్టుబడిన ఇసుక ట్రాక్టర్
- స్టేషన్‌కు తరలిస్తుండగా మానేరు కెనాల్‌పై బోల్తా
- హోంగార్డుకు గాయాలు



బోల్తాపడిన ఇసుక ట్రాక్టర్

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మండలంలో ఇసుక స్మగ్లర్లు మరోసారి రెచ్చిపోయారు. ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతుందనడానికి నిదర్శనంగా ముస్తాబాద్–పోతుగల్ మధ్య మానేరు కెనాల్‌పై మంగళవారం ఓ ఇసుక ట్రాక్టర్ బోల్తాపడిన ఘటన రుజువుగా నిలుస్తుంది. ఎస్సై గణేశ్ తెలిపిన వివరాలు.. పోతుగల్ నక్కవాగు నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. హోంగార్డు వెంకట్ ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తుండగా మానేరు కెనాల్‌పై బోల్తా పడింది. ఈ ఘటనలో ట్రాక్టర్‌పై ఉన్న హోంగార్డు కింద పడిపోగా గాయాలపాలయ్యాడు. డ్రైవర్ గోపి తృటిలో తప్పించుకున్నాడు. అయితే ట్రాక్టర్‌ను డ్రైవర్ కావాలనే బోల్తా కొట్టించారా లేదా ప్రమాదవశాత్తు బోల్తాపడిందా అనే విషయంపై పోలీసులు విచారణ చేస్తున్నారు. గతంలో నామాపూర్‌లో పోలీసులకు పట్టుబడిన ఇసుక ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలిస్తుండగా డ్రైవర్ చెరువులోకి తీసుకెళ్లిన ఘటనలో కానిస్టేబుల్ సత్యనారాయణ తీవ్రగాయాలకు గురై.. అచేతన స్థితిలో ఉన్న సంగతి విదితమే. అలాంటి ఘటనే ప్రస్తుతం కూడా జరిగి ఉంటుందనే చర్చ జరుగుతోంది. మానేరు కెనాల్‌పై దారి ఎత్తు వంపులు ఉండడం వల్ల కూడా ట్రాక్టర్ బోల్తా పడి ఉండవచ్చని ఎస్సై తెలిపారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

జమ్మికుంట: అలయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ పరికిపండ్ల నరహరి, జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ సంయుక్తంగా నిరుద్యోగ యువతకు నిర్వహించే ఉచిత నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని అలయ ఫౌండేషన్ స్టేట్ కో– ఆర్డినేటర్ గాదె గుణసాగర్ సూచించారు. డ్రైవాల్, పాల్స్ సీలింగ్ టెక్నిషియన్, వెల్డింగ్, ఫ్యాబికేషన్ టెక్నీషియన్, ఆటో మొబైల్స్, టూ వీలర్, ఫీల్డ్ టెక్నిషియన్, ఎయిర్‌కండిషన్ అసిస్టెంట్, ఎలక్ట్రిషియన్, ఎక్స్‌కవేటర్ ఆపరేటర్, ఆఫీస్ పరేషన్ ఎగ్జిక్యూటివ్ వంటి కోర్సుల్లో శిక్షణ పొందవచ్చాన్నారు. వయస్సు 18 నుంచి 35ఏళ్ల మధ్య ఉండాలన్నారు. రెండు నెలల శిక్షణ, నెల ఆన్‌ టైం జాబ్, పరిశ్రమ భాగస్వామ్యంతో శిక్షణ, కోర్సు సర్టిఫికెట్ అందిస్తామని అన్నారు. విద్యార్హతలు 8వ తరగతి నుంచి డిగ్రీవరకు చదువుకున్నవారు అర్హులని తెలిపారు. శిక్షణకాలంలో ఉచిత వసతి, భోజనం ఉంటుందన్నారు. రిజిస్ట్రేషన్ కోసం 5 జనవరి 2025వరకు వాట్సప్ నంబర్లు 9949446802, 9885981959, 9177413107ను సంప్రదించాలని పేర్కొన్నారు.